భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు.ఈ నెల 9న అమ్మవారి కల్యాణం జరుగనున్న నేపథ్యంలో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆలయ పరిసరాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కల్యాణం ఆలయం లోపలే నిర్వహించేవారని రాష్ట్రం వచ్చాక ఆలయం ముందు, పక్కన రెండు భారీ రేకుల షెడ్లను నిర్మించి ఆలయం ముందే అత్యంత ఘనంగా జరిపిస్తున్నట్లు చెప్పారు. భక్తులు వీక్షించేందుకు వీలుగా ప్రసార మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం (లైవ్ టెలీకాస్ట్) చేయడం జరుగుతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, అధికారులు రవీంద్ర మోహన్, డాక్టర్ వెంకట్, జగన్, ఇందిర, శంకర్, ఆలయ ఈఓ అంజనీకుమారి, చైర్మన్ సాయిబాబాగౌడ్, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి పాల్గొన్నారు.

హమాల్‌బస్తీలో పర్యటన..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్ బస్తీలో శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, జలమండలి జీఎం వినోద్, బ్రహ్మారెడ్డి, ఈఈ సుదర్శన్ తదితర విభాగాల అధికారులతో కలిసి బస్తీలో పాదయాత్ర చేశారు. బస్తీలో ఉన్న టాయ్‌లెట్స్ శిథిలావస్థకు చేరాయని, పార్కు వ్యర్థాలతో అస్తవ్యస్తంగా మారిందని సరైన రహదారులు లేవని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన తలసాని మాట్లాడుతూ బస్తీలో ఎస్ఎస్ ఫ్లోరింగ్, డ్రైనేజీ పనుల కోసం నిధులు మంజూరైన శంకుస్థాపన చేసినా ఇంతవరకు ఎందుకు ప్రారంభించడం లేదని అధికారులను ప్రశ్నించారు. టాయ్‌లెట్స్ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పార్కులోని వ్యర్థాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట హేమలత, పవన్‌కుమార్ గౌడ్, సుభాష్, యాదగిరి, రవి, రాజు, కుషాల్ ఉన్నారు.

అమ్మవారి ఘటం..
ఇంటింటికీ దర్శన భాగ్యం!

- పూర్తయిన ఏర్పాట్లు
- నేడు ఎదుర్కోళ్లతో బోనాలకు అంకురార్పణ
- సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఘటంపై ప్రత్యేక కథనం



బన్సీలాల్‌పేట్: లష్కర్ బోనాల పండుగ అనగానే కొత్తకుండలో ప్రత్యేకంగా వండిన ప్రసాద నైవేద్యం.. డప్పుల దరువులు.. పోతరాజుల వీరంగాలు.. ఫలహారపు బండ్ల ఊరేగింపులు రంగం ద్వారా భవిష్యవాణి వినిపించడం గుర్తుకొస్తాయి. కానీ.. జాతరలో ప్రతి ఇంటింటికీ వెళ్లి భక్తులకు దర్శనభాగ్యం కల్పించే ఘటం అత్యంత కీలకమైంది. పొడవైన వెదురు బద్దలతో నిలువెత్తు ఆకారం పూలతో అందంగా తీర్చిదిద్ది నడుమ అమ్మవారి విగ్రహాన్ని అమర్చి ఆకర్షణీయంగా రూపొందించేదే ఘటం. ఒంటినిండా పసుపు పూసుకున్న వ్యక్తులు ఘటాన్ని అధిరోహించి తలపై ఉన్న ఘటం కింద పడకుండా డప్పుల దరువులకు అనుగుణంగా విన్యాసాలు చేస్తుంటారు. సుమారు 60 కిలోల బరువుతో కూడిన ఘటాన్ని కేవలం పసుపు ముద్ద, తలచుట్టకు మధ్యన పెట్టి పడకుండా చూడాల్సి ఉంటుంది.

13 రోజుల పాటు..

సికింద్రాబాద్‌లో 15కు పైగా ఆలయాలకు సంబంధించిన అమ్మవారి ఘటాలు ఈ రకంగా 13 రోజుల పాటు ఆయా ప్రాంతాల్లో భక్తులకు దర్శనమిస్తుంటాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి బోనాల వేడుకలు జులై 21 ఆదివారం బోనాలు, 22న రంగం కార్యక్రమం ఉంటుంది. ఇందు కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అమ్మవారి బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

జాతర ముగిసే వరకూ..

ఆషాఢమాసం తొలి ఆదివారం ఈ నెల 7వ తేదీన సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఘటం ఎదుర్కోలు ఉత్సవాల్లో పాల్గొంటుంది. సోమ సుందరం వీధిలోని దేవి పోచమ్మ, కళాసిగూడలోని మాతా ముత్యాలమ్మ, శివాజీనగర్‌లోని డొక్కలమ్మ, రెజిమెంటల్ బజార్‌లోని గండిమైసమ్మ, ఓరుగంటి ఎల్లమ్మ, సెకెండ్ బజార్‌లోని ముత్యాలమ్మ, పీనుగుల మల్లన్న, కుమ్మరిగూడలోని నల్లపోచమ్మ, ఆర్‌పీ రోడ్డులోని మావురాల పెద్దమ్మ వంటి అమ్మవారి ఘటాలు కూడా ఎదుర్కోలు ఉత్సవాల్లో వేర్వేరుగా పాల్గొంటాయి. ప్రధానంగా సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఘటం బోట్స్‌క్లబ్ సమీపంలోని బుద్ధభవన్ ఎదురు సందులో ఉన్న మహంకాళమ్మ దేవాలయంలో రూపుదిద్దుకుంటుంది. జూలై 20న శనివారం రాత్రి వరకు ఆయా బస్తీలు.. కాలనీల్లో ఊరేగుతూ భక్త జనుల పూజలు అందుకుంటాయి. 21 ఆదివారం బోనాల పండుగ రోజున ఉజ్జయిని మహాకాళి మినహా ఇతర ఘటాలు ఆనకట్ట ఉత్సవాల్లో పాల్గొంటాయి. 22వ తేదీ సోమవారం రంగం కార్యక్రమం ముగిసిన తర్వాత అమ్మవారి ఘటం వీడ్కోలు ఉత్సవంలో పాల్గొనడంతో జాతర పూర్తవుతోంది.

ఘటం చరిత్ర ఇలా..

తొలినాళ్లలో ఘటం అనేది ఉండేది కాదు. ప్రధానంగా 1813లో సురిటి అప్పయ్య అనే మిలటరీ ఉద్యోగి మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని ప్రాంతంలో విధులు నిర్వహించే వారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో కలరా వ్యాధి సోకి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కలారా వ్యాధి తగ్గితే సికింద్రాబాద్‌లో ఆలయాన్ని కడతానని మొక్కుకున్నారు. ఆ తర్వాత సికింద్రాబాద్‌లో ఆలయాన్ని నిర్మించారు. అయితే దివ్యాంగులు వృద్ధుల వంటి ఆలయానికి రాలేని వారికి ఇంటి వద్దే అమ్మవారి దర్శనభాగ్యం కల్పించేందుకు అమ్మవారి ఘటాన్ని తయారు చేశారు.

సమస్యల పరిష్కారానికి సీపీఎం కృషి

అడ్డగుట్ట: నగర ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సీపీఎం కృషి చేస్తోందని సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా శనివారం అడ్డగుట్టలో బస్తీబాట కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీఎం నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డుల మంజూరు, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంపు, మెట్రోరైల్ చార్జీలను తగ్గించి మూడు కోచ్‌లను ఆరు కోచ్‌లకు పెంచాలని డిమాండ్ చేశారు. బస్తీబాటలో వెంకటేష్, ఆర్. మల్లేష్, బాలయ్య, కృపాకర్, ఫాతిమా, యాకమ్మ, సరోజమ్మ, గోపాల్, యాదగిరి పాల్గొన్నారు.

నర్సయ్య యాదవ్ సేవలు మరువలేనివి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాలువ నర్సయ్య యాదవ్ చేసిన సేవలు మరువలేనివని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్ అన్నారు.శనివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన నర్సయ్యయాదవ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. గొల్లకురుమల సంక్షేమానికి సహకార సంఘాలు స్థాపించి అందరిని ఏకం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మధుయాదవ్, ఆవుల రాజన్న యాదవ్, రమేష్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలల బస్సుల తనిఖీ



బస్సు వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని చిలకలగూడ కూడలి వద్ద శనివారం ఉత్తర మండలం రవాణాశాఖ అధికారులు, చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ అధికారులు పాఠశాలల బస్సులు, ఇతర వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవర్ లైసెన్స్‌పై ఆరా తీశారు. విద్యార్థులను తీసుకెళ్లే వాహనాల్లో ప్రథమ చికిత్స, అగ్నిమాపక సామగ్రి కిట్లు ఉంచుకోవాలన్నారు. నియమాలు పాటించని పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఉత్తర మండలం సహాయక మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు.

బోనాల నిర్వహణకు నిధుల విడుదల



కొండా సురేఖకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సనత్‌నగర్: బోనాల ఉత్సవాల నిర్వహణకు సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానానికి (16 ఆలయాల సముదాయం) ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. టూరిజం ప్లాజాలో శనివారం జరిగిన బోనాల నిధుల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసరాజు, దేవస్థానం ముఖ్య అర్చకులు, దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ జేఏసీ కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు రూ.11 లక్షల చెక్కును మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించడం, భద్రతా ఏర్పాట్లు చేయడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థానం సూపరింటెండెంట్ కాటం శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

- దేవాదాయ శాఖలో స్థపతిగా పనిచేసిన ఆనందాచారి వేలు ఇటీవల పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల ఆయనకు అభినందన, దేవాదాయ శాఖ కమిషనర్‌గా పదవీ విరమణ పొందిన అనిల్‌కుమార్‌కు వీడ్కోలు కార్యక్రమాలను త్వరలో నిర్వహించనున్నట్లు పరాశరం రవీంద్రాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, ఉద్యోగ సంఘం అధ్యక్షులు కాండూరు కృష్ణమాచార్యులు, బండారి జగపతి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత

సికింద్రాబాద్: పార్శిగుట్టకు చెందిన నిశాంత్ అనే వ్యక్తి శస్త్రచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.75 లక్షల చెక్కును శనివారం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అందించారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ నాయకులు సుంకు రాంచందర్, రాజేశ్, టీఆర్‌టీ శేఖర్, పాక సాయి దితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



రసూల్‌పురా: కంటోన్మెంట్ డ్రీమ్‌ల్యాండ్ గార్డెన్‌లో శనివారం జరిగిన సోమాజిగూడ విల్లామేరి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సాంప్రదాయబద్ధంగా చీరలు, లంగావోణిలతో పాటు మోడర్న్ డ్రెస్‌లతో నృత్యాలు చేస్తూ విద్యార్థినులు హోరెత్తించారు. డీజేల హోరులో సినిమా పాటలకు స్టెప్పులేసి ఉర్రూతలూగించారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులను స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఫిలోమినా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని కోరారు.

బోయిగూడలో రేబిస్ వ్యాక్సినేషన్



కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ అయోధ్య

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిగూడలోని పశు వైద్యశాలలో శనివారం ప్రపంచ జోనోసిస్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పెంపుడు జంతువులకు యాంటీరేబిస్ వ్యాక్సిన్‌ను ఇచ్చారు. ఈ సందర్భంగా పశు వైద్యశాల ప్రొఫెసర్ ఎస్. అయోధ్య మాట్లాడుతూ.. మనుషుల నుంచి జంతువులు, జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జోనోసిస్ వ్యాధులు అంటారని చెప్పారు. 1885 జులై 6న ప్రముఖ శాస్త్రవేత్త లూయిపాశ్చర్ మొదటిసారిగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాను తయారు చేశారని పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడిపై ఈ రేబిస్‌ను ప్రయోగించి విజయం సాధించి సదరు బాలుడి ప్రాణాలను కాపాడారన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జూలై 6న జోనోసిస్ డేను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది జంతు ప్రేమికులు తమ కుక్కలను వ్యాక్సిన్లు వేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జీవన్ జ్యోతి, మోహిత శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పించిన ఎమ్మెల్యే తలసాని





నివాళులర్పించిన తహసీల్దార్, తదితరులు

పద్మారావునగర్: దేశ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు నివాళులర్పించారు. బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై నివాళులర్పించారు. సుదర్శన్‌బాబు, కార్పొరేటర్ కె. హేమలత, అశోక్, మహేందర్, లక్ష్మీపతి, ప్రేమ్, శంకర్, కుమార్ యాదవ్, ఝాన్సీ పాల్గొన్నారు.

అమీర్‌పేట: దళిత జాతి అభ్యున్నతికి పాటు పడిన మహానేత బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా అమీర్‌పేటలోని ఆయన విగ్రహానికి తహసీల్దార్ భూమయ్యగౌడ్ స్థానిక నేతలు హనుమంత్‌రావు, రామేశ్వరం రమేష్, శ్రీనివాస్, హరిసింగ్ జాదవ్, ఎం.రమేష్, నారాయణరాజు నివాళులర్పించారు.

రసూల్‌పురా: దళితుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి శ్రీకిషన్ మాదిగ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బాలంరాయి చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నాయకులు ముప్పిడి మధుకర్, మంద మధుకర్, రంజిత్, బాబేందర్, నరసింహ రాకేష్ మాదిగ, దేవేందర్. శ్రీనివాస్ గౌడ్ నివాళి అర్పించారు.

కేంద్ర మంత్రికి అభినందనలు

కంటోన్మెంట్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా నగరానికి వచ్చిన బండి సంజయ్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి అలేఖ్య ప్రతాప్ మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన బాల మహోత్సవ్

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ సౌత్ లాల్‌గూడలోని రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్‌లో దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ స్థాయి బాల్ మహోత్సవ్ వేడుకలు ముగిశాయి. జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఈ వేడుకల్లో పాల్గొని బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్, గైడ్స్, జాతీయ ప్రధాన కార్యాలయం, డైరెక్టర్ (ఐ/సీ) దర్శన పవస్కర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి పి.కిషోర్ బాబు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

అడ్డగుట్ట: వర్గ, సామాజిక ఉద్యమాల నిర్మాణం కోసం జరుగుతున్న శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు గాదె మల్లేషం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం అడ్డగుట్టలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి హాజరవుతారన్నారు.ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి భాషపాక యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ దర్శనం



అమీర్‌పేట: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్‌గౌడ్ బల్కంపేట ఎల్లమ్మను శనివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట నాయకులు శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.

ఆహ్వానం

లాలాపేట: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రసిడెంట్ ఆలకుంట లింగయ్య శనివారం రాజ్యసభ సభ్యులు ఎం. అనీల్‌కుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. త్వరలో రానున్న బోనాల జాతర వేడుకలకు తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌కు రావాలని కోరుతూ ఆహ్వానాన్ని అందజేశారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మల్కాజిగిరికి చెందిన రాజేశ్ (37) టెంట్‌హౌజ్ వర్కర్. శనివారం ఉదయం సికింద్రాబాద్–లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటేందుకు ప్రయత్నింస్తుండగా వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎవరు అడ్డుపడినా విలీనం ఆగదు



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసిన కంటోన్మెంట్ కాంట్రాక్ట్ వర్కర్స్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయడాన్ని అడ్డుకునేందుకు కొందరు స్వార్థపరులు చేసే ప్రయత్నాలు ఫలించబోవని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ కాంట్రాక్ట్ కార్మికులు సంఘం నేత నర్సింహ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను పికెట్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. జీహెచ్ఎంసీల విలీనం అనంతరం కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని యూనియన్ నేత నర్సింహ ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ యూనియన్ వర్కర్స్‌గా కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు వర్కర్స్‌కు తగిన గుర్తింపు, సదుపాయాలు లేవన్నారు. జీహెచ్ఎంసీలో విలీనం అనంతరం వారికి తగిన ఉద్యోగ భద్రత, సదుపాయాలు కలిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ వర్కర్స్ అధ్యక్షుడు నరసింహ, రవీందర్, వర్కర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

కంటోన్మెంట్: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదల ఆరోగ్యానికి సంజీవనిలా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మారేడుపల్లి ప్రాంతానికి చెందిన కనకయ్యకు మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీ పత్రాలను ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

రాంగోపాల్‌పేట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని ఎస్‌బీఐ ప్యాట్నీ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవీంద్ర హిటాష్లీ అన్నారు. ఎస్‌బీఐ బ్యాంక్ డే ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్‌బీఐ సికింద్రాబాద్ అడ్మిన్ ఆఫీస్‌లో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది ఆపద సమయంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని అలాగే తలసీమియా రోగులకు నిరంతరం రక్తాన్ని ఎక్కించాల్సి ఉంటుందని తెలిపారు. బ్యాంకు ఉద్యోగులు సామాజిక స్పృహను చాటుతూ రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ఆర్ఎస్ సుందరం, డాక్టర్ కే శశిధర్, ఎస్‌బీఐఓఏ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఐ కృష్ణంరాజు (హెచ్‌సీ), ఏ గిరిధర్ (హెచ్‌సీ) పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



సనత్‌నగర్: ట్రాఫిక్ చలాన్లు నుంచి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్లను విరగ్గొట్టడం, చేతులు, మాస్కులు వంటివి అడ్డుపెట్టడం నేరమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాంచందర్ హెచ్చరించారు. బేగంపేటలోని తాజ్ వివంతా హోటల్ సిబ్బందికి 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అనే అంశంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ..ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరు మొక్కలను పెంచాలి

రాంగోపాల్‌పేట్: వాతావరణ మార్పులతో కలిగే దుష్పరిణామాలను ఎదుర్కొనేందుకు మొక్కలను పెంచాలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో హరితభారత్‌లో భాగంగా శనివారం ఎంజీరోడ్డులోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరాల్లో దీన్ని తగ్గించేందుకు, తగ్గిపోతున్న వాయునాణ్యతను పెంచేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ఎంతో అవసరమన్నారు. జీఎం నాగేందర్, ఏజీఎం కృష్ణ, ఆర్ఐ హరికృష్ణ, మెహిదిపట్నం జోన్ కోఆర్డినేటర్, సహాయ కో ఆర్డినేటర్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ బబిత, డీన్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గుజరాతీ స్కూల్‌లో మెగా జాబ్‌మేళా

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని గుజరాతీ స్కూల్‌లో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ ఇంటర్నేషనల్ గ్రీన్‌లాండ్ క్లబ్, రాంకీ ఫౌండేషన్ అధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో 76 కంపెనీలు, 2,600 అభ్యర్థులు హాజరు కాగా 2,450 మంది ఉద్యోగ నియామకాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాంకీ కంపెనీ డైరెక్టర్ పీజీ శాస్త్రీ, ప్రెసిడెంట్ ఎం. రామిరెడ్డి, లయన్స్ క్లబ్ గ్రీన్‌లాండ్ లక్ష్మీకుమారీ, అంబర్‌పేట్ పోలీసు శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ పి. మధుకర్ స్వామి, న్యాయవాది సందీప్ హరి, భాస్కర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన పీజీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ఎనిమిది వర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ఓయూ క్యాంపస్‌లోని ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో ఉదయం రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి ఎకనామిక్స్ ప్రశ్నపత్రం కోడ్‌ను పారంభించారు. తొలిరోజు ఎంఏ తెలుగు, ఎకనామిక్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, డాటా సైన్స్ కోర్సుల ప్రవేశ పరీక్షలకు 87.17 శాతం మంది హాజరైనట్లు టీఎస్ సీపీజీఈటీ–2024 కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. నేడు జరగాల్సిన ఎంఈడీ ప్రవేశ పరీక్షను 16కు వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మృతదేహం స్వాధీనం

రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని ఓ మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలోని మెట్రో కేఫ్ హోటల్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని మహిళ అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు నిర్ధారించారు. మృతురాలికి 60–65 ఏళ్ల వయస్సు ఉంటుందని సంబంధీకులు ఉంటే గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి

జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని కూడళ్లలో ఆయన చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం



జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



బేగంపేటలో నెమలి ఆనంద్ ఆధ్వర్యంలో..



నివాళి అర్పిస్తున్న నాయకులు



చిలకలగూడలో..



నివాళులర్పించిన బీజేపీ నాయకులు